శతక బాదారు

ట్రావిస్ హెడ్, స్మిత్ సెంచరీలు • ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 405/7 • బుమ్రా పాంచ్ పటాకా

పెట్టని కోటలాంటి గబ్బాపై ఆస్ట్రేలియా పట్టు బిగిస్తున్నది. తొలి రోజు ఆట వరుణుడిదైతే మలి రోజు భారత బౌలర్లను వీరబాదుడు బాదుతూ ట్రావిస్ హెడ్, స్టీవ్ స్మిత్ సూపర్ సెంచరీలతో కదంతొక్కారు. టాపార్డర్ పనిపట్టామనుకున్న టీమ్ఇండియా ఆశలపై నీళ్లు గుమ్మరిస్తూ హెడ్, స్మిత్ గబ్బాలో పరుగుల వరద పారించారు. టీమ్ఇండియాకు కొరకరాని కొయ్యగా మారిన హెడ్ మరోమారు ధనాధన్ సెంచరీతో విరుచుకుపడ్డాడు. బౌలర్లను ఏమ్రాతం లెక్కచేయకుండా బౌండరీలతో దుమ్మురేపాడు. ఫామ్‌లేమితో ఎదురవుతున్న విమర్శలకు స్మిత్ సెంచరీతో చెక్ పెట్టాడు. హెడ్, స్మిత్ శతకాలతో భారీ ఆధిక్యం దిశగా సాగిన ఆసీస్‌ను బుమ్రా దెబ్బ తీశాడు. సహచరులు విఫలమైన చోట ఒంటరి ప్రదర్శనతో కంగారూల నడ్డివిరిచాడు. మూడు రోజులు మిగిలున్న టెస్టులో భారత్‌పై ఆసీస్ ఆధిక్యం కొనసాగుతున్నది.

బ్రిస్బేన్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ(బీజీటీ) సిరీస్‌లో భారత్, ఆస్ట్రేలియా మధ్య రసవత్తర పోరు జరుగుతున్నది. చెరో టెస్టు గెలిచి 1-1తో సమంగా మూడో టెస్టులో అడుగుపెట్టిన ఇరు జట్లు హోరాహోరీగా తలపడుతున్నాయి. సొంత గడ్డపై పరిస్థితులను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ఆసీస్ ప్రయత్నిస్తుంటే.. టీమ్ఇండియా దీటైన పోటీనిచ్చేందుకు సై అంటున్నది. టెస్టు తొలి రోజు ఆటకు వరుణుడు అంతరాయం కల్గించగా, రెండో రోజు షెడ్యూల్ కంటే అరగంట ముందు మ్యాచ్ ప్రారంభించారు. ఓవర్‌నైట్ స్కోరు 28/0తో ఆదివారం ఆట కొనసాగించిన ఆసీస్ 7 వికెట్ల నష్టానికి 405 పరుగులు చేసింది. ట్రావిస్ హెడ్(160 బంతుల్లో 152, 18ఫోర్లు), స్టీవ్ స్మిత్(190 బంతుల్లో 101, 12ఫోర్లు) సెంచరీలతో విజృంభించారు. అడిలైడ్ జోరును బ్రిస్బేన్‌లోనూ కొనసాగిస్తూ హెడ్ మరోమారు సెంచరీతో టీమ్ఇండియాపై విరుచుకుపడ్డాడు. అలెక్స్ క్యారీ(45), స్టార్క్ (7) క్రీజులో ఉన్నారు. బుమ్రా (5/72) ఒంటరి ప్రదర్శన కనబర్చగా, సిరాజ్ (1/97), నితీశ్‌కుమార్(1/65) ఒక్కో వికెట్ ఖాతాలో వేసుకున్నారు. చేతిలో మూడు వికెట్లు ఉన్న ఆసీస్ భారీ స్కోరుపై దృష్టి పెట్టింది. తొలి సెషన్‌లో కంగారూలకు కళ్లెం వేయక పోతే భారత్ భారీ మూల్యం చెల్లించుకోవడం ఖాయం. మిగిలిన మూడు రోజులు వాతావరణం అనుకూలించే అవకాశం లేదన్న వార్తల నేపథ్యంలో టీమ్ఇండియా బ్యాటింగ్‌పై ఆందోళన నెలకొన్నది.

హెడ్, స్మిత్ మోత:

రెండో రోజు తొలి ఇన్నింగ్స్‌కు దిగిన ఆసీస్‌కు మెరుగైన శుభారంభం దక్కలేదు. బీజీటీ సిరీస్‌లో తమకు చేదు మాత్రగా మిగిలిన బుమ్రా మరోమారు ఆసీస్ ఓపెనర్లు ఉస్మాన్ ఖవాజ(21), మెక్‌స్వినీ(9) పెవిలియన్ పంపి ఆసీస్ శిబిరంలో ఆందోళన రేపాడు. ఇన్నింగ్స్ మొదలైన నాలుగో ఓవర్‌లోనే తొలుత ఖవాజను స్వింగ్ డెలివరీతోబుమ్రా తొలివికెట్‌గా సాగనంపాడు. ఆ తర్వాత..మెక్‌స్వినీ..కోహ్లీకి క్యాచ్ ఇచ్చి ఖవాజను ఆనుసరించాడు. దీంతో ఆసీస్ 38 పరుగులకే ఓపెనర్ల వికెట్లు కోల్పోయింది. ఈ తరుణంలో లబుషేన్(12), స్మిత్ ఇన్నింగ్స్‌ను గాడిలో వేసే ప్రయత్నం చేశారు. క్రీజులో కుదురుకునేందుకు వీరు ప్రయత్నం చేయగా, బౌలింగ్ మార్పుగా వచ్చిన తెలుగు యువ ఆల్‌రౌండర్ నితీశ్‌కుమార్‌రెడ్డి..లబుషేన్‌ను ఔట్ చేసి భారత్‌ను పోటీలోకి తీసుకొచ్చాడు. దీంతో 75 పరుగులకే ఆసీస్ 3 వికెట్లు కోల్పోయింది. ఈ తరుణంలో స్మిత్‌కు హెడ్ జత కలువడం ఇన్నింగ్స్ గతిని మార్చింది. సిరీస్‌లో తన సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తూ హెడ్..ఆది నుంచే భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. హెడ్‌ను అడ్డుకునేందుకు అటాకింగ్ ఫీల్డ్ పెట్టాల్సిన కెప్టెన్ రోహిత్..సింగిల్స్‌కు అవకాశమివ్వడంతో అతని పని సులువైంది. ఇదే అదనుగా క్రీజులో పాతుకుపోయిన హెడ్..బౌండరీలతో విరుచుకుపడ్డాడు. స్వల్ప గాయంతో సిరాజ్ ఓవర్ మధ్యలోనే పెవిలియన్ వెళ్లడం కొంత అలజడి కల్గించింది. కొత్త బంతి కోసం ప్రధాన బౌలర్లకు విశ్రాంతిని చ్చిన రోహిత్..జడేజా, నితీశ్‌తో బౌలింగ్ చేయించడం హెడ్, స్మిత్‌కు కలిసొచ్చింది. ఈ క్రమంలో హెడ్ తొలుత సెంచరీ ఖాతాలో వేసుకోగా, ఆకాశ్‌దీప్ బౌలింగ్‌లో సింగిల్‌తో ఈ ఏడాది తొలి సెంచరీని స్మిత్ అందుకున్నాడు. ఓవరాల్‌గా టెస్టుల్లో స్మిత్‌కు ఇది 33వది కాగా, భారత్‌పై 10వ కావడం విశేషం. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని బుమ్రా విడదీయడం మ్యాచ్‌ను మలుపుతిప్పింది. బుమ్రా బౌలింగ్‌లో రోహిత్ క్యాచ్‌తో స్మిత్ ఔట్ కావడంతో నాలుగో వికెట్‌కు 241 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత వచ్చిన మార్ష్(5), హెడ్ పరుగు తేడాతో పెవిలియన్ చేరడంతో భారత్ ఊపిరి పీల్చుకుంది. ఆఖర్లో మళ్లీ బౌలింగ్‌కు వచ్చిన సిరాజ్..కెప్టెన్ కమిన్స్(20)ను ఔట్ చేశాడు.

సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 101 ఓవర్లలో 405/7(హెడ్ 152, స్మిత్ 101, బుమ్రా 5/72, నితీశ్ 1/65).

సిమ్రాన్‌కు 1.9 కోట్లు

• డబ్ల్యూపీఎల్‌లో రికార్డు ధర

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) మినీ వేలంలో ముంబై యువ క్రికెటర్ సిమ్రాన్ షేక్ రికార్డు ధర పలికింది. ఆదివారం జరిగిన వేలంలో అన్‌క్యాప్‌డ్ సిమ్రాన్‌ను ఏకంగా 1.90 కోట్లతో గుజరాత్ జెయింట్స్ జట్టు తీసుకుంది. రానున్న సీజన్ కోసం నిర్వహించిన ఈ వేలంలో సిమ్రాన్ కోసం గుజరాత్, ఢిల్లీ హోరాహోరీగా తలపడ్డాయి. 5 లక్షల కనీస ధరతో వేలంలోకి ప్రవేశించిన ఈ యువ క్రికెటర్‌ను ఎట్టకేలకు గుజరాత్ తమ వశం చేసుకుంది. సిమ్రాన్ తర్వాత వెస్టిండీస్ హార్డ్ హిట్టర్ దియోంద్ర డాటిన్ (1.70 కోట్లు, గుజరాత్), కమలిని (1.60 కోట్లు, ముంబై ఇండియన్స్), ప్రేమరావత్ (1.20 కోట్లు, ఆర్‌సీబీ)తమ సొంతం చేసుకున్నాయి. వేలంలో మొత్తం 120 మంది ప్లేయర్లు 19 బెర్తుల కోసం పోటీపడ్డారు.

ఆసియా విజేత భారత్

మస్కట్: మహిళల ఆసియా కప్ హాకీ టోర్నీలో భారత విజేతగా నిలిచింది. ఆదివారం ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన ఫైనల్లో యువ భారత్ 3-2(1-1)తో మూడు సార్లు చాంపియన్ చైనాపై అద్భుత విజయం సాధించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్ల స్కోరు 1-1తో సమం కావడంతో విజేతను నిర్ణయించేందుకు నిర్వహించిన పెనాల్టీ షూటౌట్‌లో భారత్‌ను విజయం వరించింది. గోల్‌కీపర్ నిధి మూడు గోల్స్ అడ్డుకోవడం మన గెలుపులో కీలకమైంది.

ఖోఖో ప్రపంచకప్‌లో అమెరికా

న్యూఢిల్లీ: భారత్ వేదికగా తొలిసారి జరుగనున్న ఖో ఖో ప్రపంచకప్‌లో ప్రాతినిధ్యం అంతకంతకూ పెరుగుతున్నది. గ్రామీణ క్రీడగా పేరొందిన ఖో ఖో మెగాటోర్నీలో ఆడేందుకు అమెరికా, ఇంగ్లండ్, జర్మనీ, ఆస్ట్రేలియా, బ్రెజిల్, న్యూజిలాండ్ తమ సంసిద్ధత తెలియజేశాయి. జనవరి 13నుంచి 19వ తేదీ వరకు జరుగనున్న ప్రపంచకప్‌లో 24 జట్లు పోటీపడనున్నాయి. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో టోర్నీ జరుగుతుందని జాతీయ ఖో ఖో ఫెడరేషన్ అధ్యక్షుడు సుదాంశు మిట్టల్ పేర్కొన్నాడు.

ముంబైదే ముస్తాక్ అలీ

ఫైనల్లో మధ్యప్రదేశ్‌పై ఘన విజయం

బెంగళూరు: సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో ముంబై విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో ముంబై 5 వికెట్ల తేడాతో మధ్యప్రదేశ్‌పై అద్భుత విజయం సాధించింది. ఎంపీ నిర్దేశించిన 175 పరుగుల లక్ష్యఛేదనలో ముంబై 17.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేసింది. 47 పరుగులకే పృథ్విషా(10), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(16) వికెట్లు కోల్పోయిన ముంబైని సీనియర్లు సూర్యకుమార్‌యాదవ్(48), రహానే(37) ఆదుకున్నారు. వీరిద్దరు కలిసి మూడో వికెట్‌కు 52 పరుగులు జతచేశారు. అయితే 14.4 ఓవర్లలో ముంబై 129 పరుగులకు 5 వికెట్లు కోల్పోయింది. ఈ తరుణంలో సూర్యాంశ్ శెడ్జె(15 బంతుల్లో 36 నాటౌట్), అథర్వ(16 నాటౌట్) చెలరేగడంతో ముంబై గెలుపు వాకిట నిలిచింది. త్రిపురేశ్‌సింగ్(2/34) రెండు వికెట్లు తీశాడు. తొలుత కెప్టెన్ రజత్ పాటిదార్(40 బంతుల్లో 81 నాటౌట్, 6ఫోర్లు, 6సిక్స్‌లు) అజేయ అర్ధసెంచరీతో ఎంపీ 20 ఓవర్లలో 174/8 స్కోరు చేసింది. పాటిదార్ మినహా ఎవరూ పెద్దగా రాణించలేకపోయారు. శార్దుల్, రోస్టన్ రెండేసి వికెట్లు తీశారు. సూర్యాంశ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', రహానే 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' దక్కింది.

రోడ్రిగ్స్ ధమాకా

వెస్టిండీస్‌పై భారత్ భారీ గెలుపు

టీ20 సిరీస్‌లో శుభారంభం

నేవీ ముంబై: వెస్టిండీస్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత మహిళల క్రికెట్ జట్టు అదిరిపోయే బోణీ కొట్టింది. ఆదివారం జరిగిన తొలి మ్యాచ్‌లో టీమ్ఇండియా 49 పరుగుల తేడాతో విండీస్‌పై భారీ విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 195/4 స్కోరు చేసింది. రోడ్రిగ్స్ (35 బంతుల్లో 73, 9ఫోర్లు, 2సిక్స్‌లు), మందన(33 బంతుల్లో 54, 7ఫోర్లు, 2సిక్స్‌లు) అర్ధసెంచరీలతో అదరగొట్టారు. 50 పరుగులకు ఓపెనర్ ఉమా ఛెత్రీ (24) వికెట్ కోల్పోయిన టీమ్ఇండియాను మందన, రోడ్రిగ్స్ ఆదుకున్నారు. రోడ్రిగ్స్ తన ఇన్నింగ్స్‌లో 9ఫోర్లు, రెండు భారీ సిక్స్‌లతో చెలరేగింది. వీరిద్దరు కలిసి రెండో వికెట్‌కు 81 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. కరిష్మా (2/18) రెండు వికెట్లు తీసింది. ఆ తర్వాత ఛేదనకు దిగిన విండీస్ 20 ఓవర్లలో 146/7 స్కోరుకు పరిమితమైంది. టిటాస్ సాధు (3/37), దీప్తి (2/21), రాధాయాదవ్ (2/28) విండీస్ పతనంలో కీలకమయ్యారు.

యువ భారత్ బోణీ

• పాకిస్థాన్‌పై ఘన విజయం

కౌలాలంపూర్: అరంగేట్రం ఆసియా అండర్-19 మహిళల టీ20 ఆసియాకప్‌లో యువ భారత్ అదిరిపోయే బోణీ కొట్టింది. ఆదివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. పాక్ నిర్దేశించిన 68 పరుగుల లక్ష్యాన్ని టీమ్ఇండియా ఒక వికెట్ కోల్పోయి ఛేదించింది. యువ ఓపెనర్ గొంగడి త్రిష(0) పరుగుల ఖాతా తెరువకుండానే నిష్క్రమించగా, కమిలిని(44 నాటౌట్), సనికా చాల్కె(19 నాటౌట్) జట్టును గెలుపు తీరాలకు చేర్చారు. పాక్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ కమిలిని తన ఇన్నింగ్స్‌లో 4ఫోర్లు, 3సిక్స్‌లతో విజృంభించింది. తొలుత పాక్ 20 ఓవర్లలో 67/7 స్కోరు చేసింది. ఓపెనర్ కోమల్‌ఖాన్(24) టాప్‌స్కోరర్‌గా నిలువగా, మిగతావారు విఫలమయ్యారు. సోనమ్‌యాదవ్(4/6) పాక్ పతనంలో కీలకమైంది. కమిలినికి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

ఫైనల్లో ఉస్మానియా

ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఆల్‌ఇండియా ఇంటర్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ మహిళల టెన్నిస్ టోర్నీలో ఉస్మానియా యూనివర్సిటీ(ఓయూ) ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఆదివారం జరిగిన సెమీస్‌లో ఓయూ 2-1 తేడాతో మహర్షి దయానంద్ యూనివర్సిటీ(హర్యానా)పై విజయం సాధించింది. తొలుత జరిగిన సింగిల్స్ పోరులో సౌమ్య(ఓయూ) 6-7(5-7), 1-6తో అంజలిరాజ్ చేతిలో ఓటమిపాలైంది. రెండో సింగిల్స్‌లో సామ చెవికా రెడ్డి 6-1, 6-2తో నాన్సిపై అలవోకగా గెలిచింది. డబుల్స్‌లో సౌమ్య, చెవిక ద్వయం 7-5, 7-5తో అంజలిరాజ్, నాన్సి జోడీపై గెలువడంతో ఓయూ ఫైనల్ బెర్తు ఖరారైంది.

కివీస్‌కు ఆధిక్యం

• ఇంగ్లండ్‌తో మూడో టెస్టు

హామిల్టన్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడో టెస్టులో న్యూజిలాండ్ భారీ ఆధిక్యం దిశగా దూసుకెళుతున్నది. యంగ్(60), విలియమ్సన్(50) అర్ధసెంచరీలతో రెండో ఇన్నింగ్స్‌లో కివీస్ 3 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేసింది.చేతిలో 7 వికెట్లు ఉన్న కివీస్ ప్రస్తుతం 340 పరుగుల భారీ ఆధిక్యంలో కొనసాగుతున్నది. స్టాక్స్‌కు రెండు వికెట్లు దక్కాయి. తొలుత ఓవర్‌నైట్‌స్కోరు 315/9 రెండో రోజు తొలి ఇన్నింగ్స్‌కు దిగిన కివీస్ 347 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌కు దిగిన ఇంగ్లండ్.. హెన్రీ (4/48), రూర్కీ (3/33), సాంట్నర్ (3/7) ధాటికి 143 పరుగులకు ఆలౌటైంది.

భాషలకు అతీతంగా

తన నట ప్రయాణాన్ని భాషలకు అతీతంగా సాగిస్తున్నారు తారక్. ప్రస్తుతం ఆయన హృతిక్ రోషన్‌తో కలిసి బాలీవుడ్‌లో 'వార్ 2' సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ నిమిత్తం ఆయన ముంబైలోనే ఉన్నారు. అక్కడ తారక్‌పై దర్శకుడు అయాన్ ముఖర్జీ భారీ యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. వచ్చే ఏడాది ఆగస్ట్‌లో ఈ సినిమాను విడుదల చేయనున్నట్టు యష్‌రాజ్ ఫిల్మ్స్ అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమా తర్వాత కన్నడ దర్శకుడు ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో నటిస్తారు తారక్. మరో వైపు తారక్ కోసం తమిళ దర్శకులు అట్లీ, వెట్రిమారన్ కథలు వండే పనిలో ఉన్నారు. వారితో కూడా తారక్ సినిమాలు చేయనున్నట్టు కోలీవుడ్ సమాచారం. ప్రస్తుతం తారక్ చేయబోయే సినిమాలన్నీ పరభాషా దర్శకులతోనే కావడం విశేషం. తెలుగు దర్శకుడు సందీప్‌రెడ్డి వంగాతో కూడా ఓ సినిమా ఉంటుందని తెలుస్తున్నది. కాకపోతే ఆ ప్రాజెక్ట్‌కు రెండుమూడేళ్లు పట్టడం ఖాయం. ఆర్‌ఆర్‌ఆర్, దేవర చిత్రాల తర్వాత మారిన ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకొని పాన్ ఇండియా రేంజ్ కథలను ఎంచుకుంటూ, అందుకు తగ్గ దర్శకులను ఎన్నుకుంటూ ఓ ప్లాన్ ప్రకారం ముందుకెళ్తున్నారు తారక్.

శివకార్తికేయన్ మైల్‌స్టోన్ ప్రాజెక్ట్

'అమరన్'తో భారీ బ్లాక్‌బస్టర్‌ని అందుకున్నారు హీరో శివకార్తికేయన్. ప్రస్తుతం ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో ఆయన నటిస్తున్న సినిమా నిర్మాణ దశలో ఉంది. ఇదిలావుంటే.. తాజాగా నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ సుధా కొంగర దర్శకత్వంలో శివకార్తికేయన్ ఓ చిత్రం చేయనున్నారు. ఆకాష్ భాస్కరన్ నిర్మాత. ఈ చిత్రం ప్రకటన ఆదివారం విడుదలైంది. నిర్మాత మాట్లాడుతూ 'ఇది మా సంస్థ నుంచి వస్తున్న రెండో సినిమా. అలాగే శివకార్తికేయన్‌కి హీరోగా 25వ సినిమా. ఈ మైల్‌స్టోన్ ప్రాజెక్ట్‌కు నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ సుధా కొంగర డైరెక్టర్ కావడంతో ఇప్పటికే సినిమాపై అంచనాలు మొదలయ్యాయి. అత్యంత భారీగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నాం' అని తెలిపారు. జయం రవి, అథర్వ, శ్రీలీల కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రవి కె.చంద్రన్, సంగీతం: జి.వి.ప్రకాశ్‌కుమార్, నిర్మాణం: డాన్ పిక్చర్స్.

చిత్రం

బందూక్ చేతబూనిన భద్రకాళి

క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో అనుష్క ప్రధాన పాత్రగా రూపొందుతోన్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'ఘాటి'. రాజీవ్‌రెడ్డి, సాయిబాబు జాగర్ల మూడి నిర్మాతలు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో ఈ సినిమా రూపొందుతున్నది. ప్రమోషన్‌లో భాగంగా ఇటీవలే గ్లింప్స్‌ని విడుదల చేశారు. తాజాగా ఆదివారం ఈ సినిమా విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. ఏప్రిల్ 18న ప్రపంచవ్యాప్తంగా పాన్ ఇండియా రేంజ్‌లో సినిమా విడుదల కానున్నదని మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్లో చీరకట్టుకొని, చేతిలో తుపాకీతో కొండపై నిలబడి టెర్రిఫిక్ లుక్‌లో కనిపిస్తున్నది అనుష్క. ఆమె శరీరమంతటా చెల్లాచెదురుగా ఉన్న రక్తపు గుర్తులు పాత్రలోని ఉద్వేగాన్ని ఆవిష్కరిస్తున్నాయి. ప్రముఖ తారాగణం నటిస్తున్న ఈ చిత్రానికి కథ: చింతకింది శ్రీనివాసరావు, మాటలు: సాయిమాధవ్ బుర్రా, కెమెరా: మనోజ్ రెడ్డి కాటసాని, సంగీతం: నాగవెల్లి విద్యాసాగర్, కళ: తోట తరణి.

ఆదివారం మధ్యాహ్నం తన మామయ్య, ప్రఖ్యాత నటుడు చిరంజీవిని అల్లు అర్జున్ కుటుంబ సమేతంగా ఇంటికెళ్లి మరీ కలిశారు. మెగా ఫ్యామిలీతో సుమారు గంటపాటు గడిపారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో జైలు నుంచి విడుదలైన తర్వాత ఆయన కుటుంబ సమేతంగా చిరంజీవిని కలవడం ప్రత్యేకతను సంతరించుకుంది.

సతీ లీలావతి

లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలో, తాతినేని సత్య దర్శకత్వంలో, నాగ మోహన్‌బాబు.ఎం, రాజేష్.టి నిర్మిస్తున్న చిత్రానికి 'సతీ లీలావతి' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ఆదివారం లావణ్య త్రిపాఠి పుట్టిన రోజు సందర్భంగా ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ.. టైటిల్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'సతీ లీలావతిగా డిఫరెంట్‌రోల్‌లో లావణ్య కనిపించనున్నారు. ఉత్సుకతను కలిగించే కథాంశంతో ఈ సినిమా రూపొందనుంది. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం. మరిన్ని వివరాలు త్వరలో తెలియజేస్తాం' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి మాటలు: ఉదయ్ పొట్టిపాడు, కెమెరా: బినేంద్ర మీనన్, సంగీతం: మిక్కీ జె.మేయర్, నిర్మాణం: దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్.

ప్రశంసల ప్రణయగోదారి

సదన్, ప్రియాంక ప్రసాద్ జంటగా రూపొందిన ప్రేమకథ 'ప్రణయగోదారి'. పి.ఎల్.విఘ్నేష్ దర్శకుడు. పారమళ్ల లింగయ్య నిర్మాత. ఇటీవలే సినిమా విడుదలైంది. ఈ సినిమా సక్సెస్‌మీట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. సినిమా చూసినవారంతా అభినందిస్తున్నారనీ, ఇంతటి విజయాన్నిచ్చిన ప్రేక్షకులకు కృతజ్ఞతలని దర్శకుడు విఘ్నేష్ చెప్పారు. తన పాత్రను అందరూ ప్రశంసిస్తున్నారని, ఇంతటి మంచి అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్సని కథానాయిక ప్రియాంక ప్రసాద్ అన్నారు. ఇంకా చిత్ర యూనిట్ మొత్తం మాట్లాడారు.

వికటకవి ఓ విభిన్నమైన అనుభవం

'ఏడేళ్లపాటు షార్ట్‌ఫిల్మ్స్‌కు మ్యూజిక్ అందించాను. 'జగన్నాటకం' సినిమాతో సంగీత దర్శకుడిగా నా తొలి అడుగు పడింది. 'ఆయ్'తో బ్రేక్ వచ్చింది. సేవ్ ది టైగర్స్ సీజన్ 1, సీజన్ 2 వెబ్ సిరీస్‌లు మంచి పేరు తెచ్చాయి. రీసెంట్‌గా 'వికటకవి' సిరీస్‌కి వర్క్ చేశాను. చూసినవారంతా మ్యూజిక్‌ని మెచ్చుకుంటున్నారు. చాలా ఆనందంగా ఉంది' అన్నారు సంగీత దర్శకుడు అజయ్ అరసాడ. రాజేంద్ర ప్రసాద్ ప్రధాన పాత్ర పోషించిన 'వికటకవి' వెబ్ సిరీస్ ప్రస్తుతం జీ5లో స్ట్రీమింగ్ అవుతున్నది. ఈ సందర్భంగా ఆదివారం అజయ్ అరసాడ విలేకరులతో మాట్లాడారు. 'ప్రదీప్ మద్దాలి క్లారిటీ గల దర్శకుడు. అందుకే ఈ సిరీస్‌కి వర్క్ చేయడం పెద్ద కష్టం అనిపించలేదు. 'వికటకవి'కి పనిచేయడం ఓ డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్. సంగీత దర్శకుడిగా నాకు సంతృప్తినిచ్చిన సిరీస్ ఇది.' అని తెలిపారు అజయ్ అరసాడ

వెండితెరపై బాబూ జగజ్జీవన్‌రామ్

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగజ్జీవన్‌రామ్ జీవితం ఆధారంగా రూపొందుతోన్న చిత్రం 'బాబూ జగజ్జీవన్‌రామ్'. మిలటరీ ప్రసాద్ టైటిల్‌రోల్ చేస్తున్నారు. దిలీప్‌రాజా స్వీయదర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం సినిమా చిత్రీకరణ దశలో ఉంది. ఈ సినిమా విశేషాలను తెలిపేందుకు ఆదివారం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. 'మహనీయుడు బాబూ జగజ్జీవన్‌రామ్ గురించి భావితరాలకు తెలియాలనే ఈ సినిమా తీస్తున్నాను. రెండు షెడ్యూల్స్ పూర్తయ్యాయి. బాబూ జగజ్జీవన్‌రామ్ వర్ధంతి రోజైన జూలై 6న సినిమాను విడుదల చేస్తాం. ఇందులో గాంధీజీ, నేతాజీ, లాల్ బహద్దూర్ శాస్త్రి, చంద్రశేఖర్ ఆజాద్ పాత్రలు కూడా ఉంటాయి. జగజ్జీవన్‌రామ్ కుమార్తె, లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ పాత్రలో తాళ్లూరి రామేశ్వరి నటిస్తున్నారు.' అని డైరెక్టర్ దిలీప్‌రాజా తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: మురళీకృష్ణ, హరిశ్రీనివాస్, సంగీతం: వినోద్ యాజమాన్య.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.